ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 13 జూలై 2025

ఏసీబీకి చిక్కిన పంచాయతీ రాజ్ ఏఈ
- సీసీ పనుల బిల్లుకు లంచం డిమాండ్
- కాంట్రాక్టర్ నుంచి రూ.90 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు 7

ఉత్సవాలకు ముస్తాబైన మల్లన్నక్షేత్రం 7



వైభవంగా గోరింటాకు వేడుక 8



ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి 8



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలి
డీఆర్డీవో కాళిందిని


పెద్దకల్వల అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని

పెద్దపల్లి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాల ద్వారా తల్లీబిడ్డలకు పౌష్టికాహారం అందించాలని, వారికి ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించేలా చర్యలు తీసుకొని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా శనివారం పెద్దకల్వలలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. డిఆర్డీఓ మాట్లాడుతూ సభ్యులందరు ఆరోగ్య బీమా చేయించుకోవాలని, ఎవరికైనా ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే బీమా వల్ల ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ప్రభుత్వం ద్వారా అంగన్వాడీ సెంటర్లు అందించే పౌష్టికహారం ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సభ్యులకు సూచించారు. ఏపిఎం సంపత్, అంగన్వాడీ టీచర్లు, సెర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి బీజేపీలో ఎవరికి వారే..

- గుజ్జుల వర్సెస్ దుగ్యాల వర్గీయులు
- మండల కమిటీల ప్రకటనతో భగ్గుమన్న విభేదాలు
- స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీలో వర్గపోరు రోజురోజుకు తారాస్థాయికి చేరుకుం టోంది. ఒకరిపై నొకరు తీవ్ర స్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటుండడంతో పార్టీ పరువు మంట గలిసే పరిస్థితి ఏర్పడింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ వర్గ పోరు ప్రభావాన్ని చూపనున్నాయని పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ వర్గీయుల మధ్య కొంత కాలంగా నెలకొన్న విభేదాలు సద్దుమణగడం లేదు. పలువురు జిల్లా అధ్య క్షులు మారుతున్నా ఆ వర్గాలను ఒక్కటి చేయడంలో విఫలమవుతున్నారు. ఈ నెల 5న పెద్దపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలతోపాటు పెద్దపల్లి ము న్సిపల్ కమిటీలను ఆయా అధ్య క్షులు ప్రకటించడంతో మరోసారి గుజ్జుల, దుగ్యాల వర్గీయుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. రెండు వర్గాలు పోటాపోటీగా ప్రెస్‌మీట్‌లను ఏర్పాటు చేసి తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించు కున్నారు. విచిత్రమేమిటంటే గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్‌లు ఒకరిపై నొకరు ఆరోపణలు, విమర్శలు చేసుకోనప్పటికీ, వారి అనుచరులు మాత్రం తీవ్రస్థాయిలో ఆరోపణలు, ప్రత్యారో పణలు, విమర్శలు గుప్పిస్తున్నారు. సదరు నాయకుల తీరు తెన్నులను వారి వారి అనుచరులు ఎత్తి చూపడాన్ని పార్టీకి చెందిన ఇతర నాయకులు, కార్యకర్తలు ముక్కున వేలే సుకుంటున్నారు. రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతున్నా జిల్లా నాయకత్వం చోద్యం చూస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సొంత పార్టీలా వ్యవహరిస్తున్న దుగ్యాల

మండల కమిటీల ప్రకటన మరుసటి రోజే గుజ్జుల వర్గీయులు, మండల ప్రభారీలు ఆ మరుసటి రోజే ప్రెస్‌మీట్ పెట్టి భగ్గుమన్నారు. బీజేపీ కేంద్ర పార్టీ నిర్ణయం మేరకు దేశంలో సంఘటన సంరచన ద్వారా మండల కమిటీలను నియమిస్తారని, మండల అధ్య క్షులు, మండల ప్రభారీలు కమిటీని ఏర్పాటు చేసి, దానిని జిల్లా అధ్యక్షుని ఆమోదంతో ప్రకటించాల్సి ఉం టుందని వారు గుర్తు చేశారు. అయితే, దుగ్యాల ప్రదీప్ కుమార్ సొంత పార్టీలా వ్యవహరిస్తూ, నియంతృత్వ ధోరణిలో పెద్దపల్లి నియోజకవర్గంలో తనకు నచ్చిన

(మిగతా 8వ పేజీలో)

అసమ్మతి కార్యక్రమాలకు గుజ్జుల బ్రాండ్ అంబాసిడర్..

దుగ్యాల ప్రదీప్‌కుమార్‌పై గుజ్జుల వర్గీయులు చేసిన ఆరోపణలకు దీటుగా దుగ్యాల వర్గీయులు ఆ మరుసటి రోజే ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మండిపడ్డారు. 30 ఏళ్లగా గుజ్జుల రామకృష్ణారెడ్డి పార్టీని తమ వ్యక్తిగత సంస్థగా నడుపుతూ, అసమ్మతి కార్యకలాపాలకు బ్రాండ్ అంబా సిడర్‌గా పేరు తెచ్చుకున్నారని ఆరోపించారు. మాజీ కేంద్ర మంత్రి విద్యాసాగర్ రావును టార్గెట్ చేసి స్వార్థ పూరిత ప్రయోజనాల కోసం బ్లాక్ మెయిల్‌కు పాల్పడి, తర్వాత బండి సంజయ్ పై కూడా అసమ్మతి రాజకీయాలకు తెర తీసిన గుజ్జుల ఇప్పుడు అదే కుట్ర చేసి పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గీయుల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, పెద్దపల్లిలో వ్యాపారులను వేధించారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి డిపాజిట్ కోల్పోయిన గుజ్జుల రామకృష్ణారెడ్డి, అతని సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థుల గెలుపు కోసం కుమ్మక్కై పెద్దపల్లిలో బీజేపీ పతనానికి కారణ మయ్యా రని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కాకముందు కిరాయి ఇంటిలో ఉన్న ఆయన అనంతరం పెద్ద పెద్ద భవనాలు, భారీగా ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. మొత్తం గా ఇరువర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోప ణలు తారా స్థాయికి చేరుకోగా, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వం జోక్యం చేసుకుని ఆయా వర్గాలపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోక పోవడంతో వర్గ పోరు ఆగడం లేదని పార్టీ కార్యకర్తలు అంటున్నారు. దీని ప్రభావం స్థాని క సంస్థల ఎన్నికలపై పడనున్నదని, సత్వరమే రాష్ట్ర, జిల్లా నాయకత్వం జోక్యం చేసుకుని వర్గపోరును ఆపకపోతే పార్టీ భారీ నష్టాన్ని చవిచూడా ల్సి వస్తుందని పార్టీ కార్యకర్తలు అంటున్నారు.

నేడు ఓదెలలో జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం
హాజరు కానున్న హైకోర్టు జడ్జిలు


ఓదెలలో ప్రారంభించనున్న కోర్టు భవనం

ఓదెల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి, జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్టు క్లాస్ కోర్టును ఆదివారం ఉదయం హైకోర్టు జడ్జిలు ప్రారంభించనున్నారు. కోర్టు కేసులను వేగంగా పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం మండలాల్లో కోర్టులను ఏర్పాటు చేస్తోంది. మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ భవనంలో కోర్టును ఏర్పాటు చేస్తున్నారు. ఓదెల, కాలశ్రీరాంపూర్ మండలాల కేసులను వాదించన్నారు. ఈ మండలాలకు చెందిన కేసులు సుల్తానాబాద్ కోర్టు పరిధిలో ఉన్నాయి. ఆ కేసులను ఓదెలకు బదిలీ చేయనున్నారు. హైకోర్టు జడ్జీలు కె లక్ష్మణ్, ఎన్‌వీ శ్రావణ్‌కుమార్, ఈవీ వేణు గోపాల్, పుల్ల కార్తీక్, జే శ్రీనివాస్ రావు ఆరంభించనున్నారు. శనివారం జిల్లా జడ్జి సునీత మల్లికార్జున స్వామి ఆలయంలో పూజల అనంతరం కోర్టు భవనాన్ని సందర్శించారు. డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణలు సైతం సందర్శించి పోలీస్ బందోబస్తు కోసం సీఐ, ఎస్‌ఐలకు సూచనలు జారీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ బిల్లులపై ఆసుపత్రుల్లో విచారణ

- రెండు ఆసుపత్రుల్లో ఫైళ్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో
- రాహుల్ ఆసుపత్రి వద్ద గొడవ


మమత ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్న

కోల్‌సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పలువురు చికిత్స పొందారు. ఆ బిల్లులకు సంబంధించి ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి శనివారం తనిఖీలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది సీఎంఆర్‌ఎఫ్‌లో జరిగిన అవకతవకలపై సీఐడీ విచారణ జరిపి జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఆసుపత్రిపై కేసు నమోదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం ముందస్తుగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల జాబితా పంపి విచారణ జరపాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించింది. ఈ మేరకు డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి రెండు రోజులుగా విచారణ జరుపుతున్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో విచారణ జరిపిన ఆమె శనివారం జాబితాలో ఉన్న గోదావరిఖనిలోని నాలుగు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రాహుల్, శ్రీమమత, సిగ్మ, స్టార్‌మౌంట్ ఆసుపత్రుల్లో తనిఖీ చేశారు. శ్రీమమత, స్టార్ మౌంట్ ఆసుపత్రుల్లో 2023-24 బిల్లులను తనిఖీ చేశారు. సిగ్మా ఆసుపత్రిలో యాజమాన్యం మారడంతో బిల్లులు అందుబాటులో లేనట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. రాహుల్ ఆసుపత్రి తనిఖీకి వెళ్లగా గొడవ జరిగింది. ఆసుపత్రికి అనుమతులు లేకపోవడంతో డీఎంహెచ్‌ఓ సీజ్ చేసేందుకు వచ్చారనే ప్రచారం జరిగింది. దీంతో మాజీ మేయర్ బంగి అనీల్‌కుమార్ నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రి వద్దకు హనుమాన్‌నగర్ వాసులు చేరుకుని ఆసుపత్రి మూసివేయద్దంటూ నినాదాలు చేశారు. తాను సీఎంఆర్ఎఫ్ బిల్లుల పరిశీలనకు వచ్చానని, నిర్వాహకులు ఉంటేనే తనిఖీ చేస్తానని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. అనంతరం ఆమె శ్రీమమత ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. శుక్రవారం పెద్దపల్లిలోని శ్రీజ ఆసుపత్రిలో తనిఖీలు జరుపగా అక్కడ సీఎంఆర్ఎఫ్ రికార్డులు అందుబాటులో లేనట్టు పేర్కొన్నారు. గతంలో సీఎంఆర్‌ఎఫ్ అవకతవకలపై కేసు నమోదైన శ్రీసాయి ఆసుపత్రి కూడా బిల్లుల జాబితాలో ఉన్నది. ఇప్పుడు ఆ ఆసుపత్రి బొమ్మినేని హాస్పిటల్ నిర్వహిస్తుండగా అవకతవకలు జరిగాయంటూ రిజిస్ట్రేషన్ సస్పెండ్ చేశారు.

విచారణ జరుపుతున్నాం : డీఎంహెచ్‌వో

ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు చికిత్స పొందిన ఆసుపత్రిలో తనిఖీలు జరుపుతున్నాం. పెద్దపల్లిలో రెండు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రికార్డు అందుబాటులో లేవు. గోదావరిఖనిలోని శ్రీమమత, స్టార్‌మౌంట్‌లో రికార్డులు సరిగానే ఉన్నాయి. రాహుల్ ఆసుపత్రిలో తనిఖీలను అడ్డుకున్నారు.

దేశంలో సన్నబియ్యం ఇచ్చే రాష్ట్రం తెలంగాణే


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఉన్న పేదలకు సన్న బియ్యం ఇస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమే నని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శనివారం మంగపేట, కూనారం, గంగారం, పందిల్ల గ్రామాల్లో సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీ నిర్మాణాలను ప్రారంభించి, ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోశారు. అనంతరం కునారం, గంగారం గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఏడాదిన్నర కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో కాలంలో ఎలాంటి అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. రైతులకు భరోసా, రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ, కరెంటు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. మంగపేటలో లిఫ్ట్ మంజూరు చేయించి సాగునీటికి ఇబ్బంది రానీయమన్నారు. కూనారం జాఫర్‌ఖాన్‌పేట రోడ్డు, కూనారం పెద్దరాత్‌పల్లి బీటీ రోడ్డు, జగదాంబ ఓర్రెపై బ్రిడ్జి, గంగారం నుంచి పందిల్ల వరకు డబుల్ రోడ్డుతోపాటు పలు పనులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ నెల 14 నుంచి నూతన రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. సంక్రాంతి లోగా పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేసి ప్రతీ గ్రామానికి బస్సు నడిచేలా చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజవేన సదయ్య, మాజీ సర్పంచ్ డొంకెన మొగిలి, ఎంపీడీఓ పూర్ణ చందర్‌రావు, హౌసింగ్ డీఈ పరమాచారి, ఏఈ వసంత, ఎంపీఓ ఆరీఫ్, మాజీ కోఆప్షన్ సజ్జు, పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించేదెప్పుడు?

- ప్రజావాణిలో ఫిర్యాదు
- అధికారులు ఆదేశించినా ససేమిరా

ధర్మారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని గత నెల 4 ప్రజావాణిలో కలెక్టర్‌కు గ్రామానికి చెందిన గంధం మహేందర్ ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను విచారణకు ఆదేశించారు. గత నెల 18న లేఖ.నం.ఎ5/169/2025 ద్వారా డివిజనల్ పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య మోకా మీదకు వెళ్లి విచారణ చేశారు. గ్రామంలోని హన్మాన్ ఆలయం నుంచి గ్రామ పంచాయతీ వరకు గల 22 ఫీట్ల రోడ్డులో 6 ఫీట్ల రోడ్డును ఆక్రమించి పచ్చిమట్ల రేణుక ఇంటి నిర్మాణం చేసిందని, అదే విధంగా ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి గ్రామ పంచాయతీకి వెళ్ళే దారి 22 ఫీట్లు కాగా అందులో 2 ఫీట్ల రోడ్డును కట్టెకోల నర్సయ్య ఆక్రమించినట్లు అధికారులు తేల్చారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎవరూ ఆక్రమ నిర్మాణాలు చేపటిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోడ్డు ఆక్రమించి చేపట్టిన ఇంటి నిర్మాణాలను వెంటనే తొలగించాలని మండల ప్రజా పరిషత్ అధికారితో పాటు పంచాయతి అధికారికి, గ్రామ సెక్రెటరీకి డీపీవో ఆదేశాలు 21వ తేదీన జారీ చేశారు. అధికారి ఆదేశించినా ఆక్రమణ ఇంటి నిర్మాణాలు తొలగించక పోవడంపై గ్రామ ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణ ఇంటి నిర్మాణాలు తొలగించి రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇల్లు

అక్రమ నిర్మాణాలను తొలగించాలి
- గంధం మహేందర్ (మల్లాపూర్ గ్రామస్థుడు)



రోడ్లను ఎవరు ఆక్రమించినా పంచాయతీ చట్ట ప్రకారం నేరం. ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. డీపీవో విచారణ చేసి ఆక్రమణ నిజమేనని తేల్చి నిర్మాణాల తొలగింపునకు ఆదేశించారు. అయినప్పటికి అధికారులు తొలగించడం లేదు.

ఓట్లు దండుకునేందుకే బీసీల రిజర్వేషన్ల నాటకం
బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్


విలేకరుల సమవేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల నాటకం ఆడుతున్నదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల మనోభావాలను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్లు కొల్లగొట్టేందుకే రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చారని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి 20నెలలు గడిచినా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో రిజర్వేషన్‌పై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతి ఆమోదానికి పంపారని, ఇప్పుడు కొత్తగా ఆర్డినెన్స్ పేరుతో మరో మోసానికి తెరలేపిందన్నారు. మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు పెంచాలని చూస్తే కోర్టులు కొట్టివేసిన విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. బీసీలకు ద్రోహం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడుతామని, 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చట్టబద్దత లేని కుల గణన జరిపిన కాంగ్రెస్ బీసీలను మోసం చేసేందుకు రిజర్వేషన్ అమలును తెరమీదికి తీసుకువచ్చిందన్నారు. నాయకులు మురళీధర్‌రావు, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, కృష్ణవేణి, అంజలి, గాదం విజయ, పిల్లి రమేష్, జిట్టవేని ప్రశాంత్, పాల్గొన్నారు.



ఉపాధి కోర్సుతో ప్రయోజనమేది?

- దారి చూపని ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సు
- నియామకాలు మరిచిన ప్రభుత్వాలు
- ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

ఇల్లందకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్ (పురుషులు) (ఎంపీహెచ్‌ఏ-ఎం)లకు ప్రభుత్వం మొండి చేయి చూపిస్తోంది. 20 ఏళ్లుగా నియామకాలు చేపట్టకుండా ఆ కోర్సునే అపహాస్యం చేస్తోంది. ఉపాధి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయనే భరోసాతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఎంపీహెచ్‌ఏ (ఎం) బహుళ ప్రయోజక సహాయకులుగా శిక్షణ పొందారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఉద్యోగాల భర్తీని మరిచిన వైద్యఆరోగ్యశాఖ తీరుపై శిక్షణ పొందిన ఎంపీహెచ్‌ఏ(ఎం) నిరుద్యోగులు మండిపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్ (పురుషులు) కోర్సు పూర్తిచేసిన వారు 15 వేల నుంచి 20 వేల మంది ఉన్నట్లు సమాచారం. 2002నుంచి ఇప్పటి వరకు ఎంపీహెచ్‌ఏ(ఎం) ఆరోగ్య కార్యకర్తల ఉద్యోగాలను భర్తీ చేయలేదు. ప్రతిఏటా పారా మెడికల్ కళాశాలలో ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సును పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రం నిరుద్యోగులుగానే మిగులుతున్నారు. ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సుతో ఉద్యోగ అవకాశాలు లేనప్పుడు ఈ కోర్సును ప్రవేశపెట్టడం దేనికని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీ హెచ్‌ఏ(ఎం) కోర్సు పూర్తిచేసిన వారితో మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో హెల్త్ ఎడ్యుకేటర్, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీహెచ్‌సీ, జిల్లాకేంద్రాల్లో ఎంఎన్‌వో అధికారిగా ఉద్యోగాల్లో నియమించే అవకాశం ఉంటుంది. ఈ పోస్టులో రాష్ట్రప్రభుత్వం మహిళా ఆరోగ్య కార్యకర్తలను మాత్రమే భర్తీ చేస్తోంది. వారితో సమానంగా పురుష ఆరోగ్య కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగుల వయస్సు 50 ఏళ్ల దాటిపోతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సులు భర్తీ చేస్తారని ఎదురుచూశారు. వారి ఆశలు అడియాశలు అయ్యాయి. గత ప్రభుత్వం ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సులు చేసిన వారితో ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఉద్యోగాల అర్హతకు వయస్సు దాటకముందే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్స్, పీహెచ్‌సీలో పురుష ఆరోగ్య కార్యకర్తల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాలని కోరుతున్నారు. లేకపోతే ఎంపీహెచ్‌ఏ(ఎం) నిరుద్యోగుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

వయస్సు దాటిపోతోంది..



- కడవెరుగు రాజ్‌కుమార్, జమ్మికుంట

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సు పూర్తి చేసి 15ఏళ్లు అవుతోంది. దీని ద్వారా ఉద్యోగం వస్తుందని శిక్షణ పొంది తెలంగాణ పారా మెడికల్ బోర్డులో పేరు నమోదు చేసుకున్నాను. ఉద్యోగానికి వయస్సు దాటిపోతోంది. ప్రభుత్వం నోటిఫికేషన్ మాత్రం ఇవ్వడం లేదు.

పురుషులకు అవకాశం ఇవ్వాలి..



- కోడెం శంకర్, నిరుద్యోగి, జమ్మికుంట

ఎంపీహెచ్‌ఏ కోర్సు చేసిన మహిళలతో సమానంగా పురుష ఆరోగ్యకార్యకర్త పోస్టులు భర్తీ చేయాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళలు), ఎంపీహెచ్‌ఏ కార్యకర్త (పురుషులు) కూడా ఉండాల్సి ఉంటుంది.

లక్షలాది రూపాయలు పెట్టి కోర్సు చేశాను..



- రవికిషన్, ఎంపీహెచ్‌ఏ (ఎం) నిరుద్యోగి, కరీంనగర్

ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సును లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పారామెడికల్ కళాశాలలో శిక్షణ పూర్తి చేశాను. కానీ ప్రభుత్వాలు ఈ నియామకాలు చేపట్టకపోవడం వల్ల నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నాం. వెంటనే రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యశాఖలో ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సులు పూర్తి చేసిన వారితో ఉద్యోగాలు భర్తీ చేయాలి.

నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం..



- పెండం శ్రీనివాస్, జమ్మికుంట

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎం) కార్యకర్తల పోస్టుల ఉద్యోగాల భర్తీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారడం లేదు. ఉద్యోగ నోటిఫికేషన్ రానట్లయితే ఈ సర్టిఫికెట్ దేనికి పని చేస్తోంది.

మానసిక వేదనతో ఒకరి బలవన్మరణం

గంగాధర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మానసిక వేదనతో ఒకరు ఆత్మ చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయనవివరాల ప్రకారం.. గంగాధర మండలం వెంకంపల్లి గ్రామపరిధిలోని పిట్టలపల్లికి చెందిన పిట్టల రవి(50) ముప్పైఏళ్లుగా విదేశాలకు వెళ్లాడు. ఎనిమిదినెలల క్రితం స్వగ్రామానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. రవిపేరున ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కొడుకు, కోడలు శారీరకంగా, మానసికంగా వేధించారు. ఈనెల11న భూమిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. అయినా ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు తీసుకురావాలని రవిని దుర్భాషలాడతూ చేయి చేసుకున్నారు. దీంతో విసిగిపోయిన రవి ఈనెల12న పొలంవద్దకు పోతున్నానని భార్యకు చెప్పివెళ్లాడు. ఎంతసేపటికీ రవి ఇంటికిరాకపోవడంతో మధురానగర్‌లో ఉన్న అల్లుడుకి చెప్పగా అతడు వెళ్లేసరికి చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడు రవి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాల క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం మొదటి అంతస్తు పైనుంచిపడి చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. జిల్లాకేంద్రంలోని విజయపురికాలనీకి చెందిన అంకం కృష్ణవేణి(28) గతనెల 3వతేదీన ఇల్లు మారే సమయంలో ప్రమాదవశాత్తు మొదటిఅంతస్తు నుంచి కిందపడిపోయి తీవ్రగాయాలపాలైంది. అదేరోజు కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కుతరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లుపోలీసులు పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



భాషామీయా(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన భాషామీయా (56) హైదరాబాద్ గాంధీఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారంరాత్రి మృతిచెందాడు. ఈనెల2వతేదిన భాషామియాను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబసభ్యులు అతన్ని సిరిసిల్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబార్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అద్దెకు ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా దర్శి మండలం రాజంపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఏసుబాబు(48) అప్పుల బాధతో ఈనెల 9న పురుగుల మందు తాగాడు. పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తరలించారు. మూడురోజులుగా అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారంమృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం దొంగతనం

- పోలీసులకు పట్టుబడ్డ యువకుడు



యువకుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

చొప్పదండి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటకు చెందిన ఒక యువకుడు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. చేతిలో ఉన్న డబ్బులు మొత్తం బెట్టింగ్, గేమ్స్‌లో పోగొట్టుకున్నాడు. మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు డబ్బుల కోసం దొంగతనం చేశాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. ఎస్సై నరేష్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని రాగంపేటకు చెందిన కొలిపాక మధు కుమార్(20) చెడువ్యసనాలకు బానిసయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించా లనే కోరికతో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్స్‌కు డబ్బు సరిపోకపోవడంతో దొంగత నానికి పాల్పడ్డాడు. రాగంపేట గ్రామంలోని కొమురయ్య ఇంటిలో ఈనెల8న పట్టపగలు ఎవరూలేని సమయంలో ఇంటి లోపలికి వెళ్లి తాళం వేసి ఉన్న బీరువాను పగలగొట్టాడు. అందులోని తులం బంగారం, 22వేల రూపాయల నగదు ఎత్తుకుపోయాడు. ఫిర్యాదు రాగానే దర్యాప్తును ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో దొంగతనం చేసిన మధుకుమార్‌ను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. యువకుడి నుంచి బంగారం, డబ్బులు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా దొంగతనం కేసును చేధించిన ఎస్ఐ నరేష్‌రెడ్డి, ఏఎస్ఐసమ్మయ్య, పోలీసుసిబ్బంది అనిల్‌కుమార్, బి శ్రీధర్, ఎండీ ఖలీఫాను సీఐ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

జ్యువెలరీ షాప్‌లో దొంగతనం

- బంగారం, వెండీ చోరీ

జమ్మికుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ధనాల కొండయ్య కాంప్లెక్స్‌లోని ఓ నగల దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం, వెండి దొంగతనం చేశారు. కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన భోగివంశీకృష్ణ శుక్రవారం సాయంత్రం జ్యువెలరీ షాప్ మూసివేసి వెళ్లాడు. శనివారం ఉదయం పక్కషాపు యాజమాని మీ షాప్ షట్టర్ పగలగొట్టి ఉందని తెలిపాడు. దీంతో వంశీకృష్ణ షాప్‌వద్దకు చేరుకోని చూడగా రెండు తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు దొంగలు ఎత్తికెళ్లినట్టు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందిచగా పట్టణ సీఐ రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించి సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించారు. షాపు యాజమాని వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ రాంనర్సింహారెడి

ధర్మపురి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొనూర్ గ్రామంలో ఈనెల 10న జరిగిన హత్య కేసులో నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ధర్మపురి సీఐ ఎ రాంనర్సింహారెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలు ఆయన వెల్లడించారు. మండ లంలోని దొనూర్ గ్రామానికి చెందిన గొల్లెన రవి(45), గొల్లెన నాగరాజు పక్కపక్కనే నివాసం ఉంటారు. ఐదేళ్లుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రవి నూతనంగా ఇళ్లు నిర్మిస్తుండగా స్థలం హద్దు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహం చెందిన నాగరాజు అతని తల్లిదండ్రులు అమ్మక్క, బక్కయ్య ప్రోత్సాహంతో ఇంటి నుంచి కత్తి తీసుకొని గొల్లెన రవి కడుపులో పొడిచాడు. గమనించిన రవి కొడుకు విష్ణు అడ్డుకోబోగా అతనిపై కూడా దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన రవిని హుటాహుటిన జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపగా గొల్లెన నాగరాజు, అమ్మక్క, బక్కయ్యను శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఎస్ఐలు పులిచెర్ల ఉదయ్‌కుమార్, ఎస్ఐ2 రవికుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



శ్రీరాములపేటలో రోడ్డు పక్కనే పొదల మాటున్న ఉన్న వ్యవసాయ బావి

వీణవంక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరీంనగర్ జమ్మికుంట రహదారిపై రోడ్డుపక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీణవంక నుంచి మానకొండూరు వరకు రోడ్డు విస్తరణ చేపట్టిన కాంట్రాక్టర్ వ్యవసాయ బావులవద్ద రక్షణగోడ నిర్మించలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మండలంలోని వల్భాపూర్‌నుంచి మామిడాలపల్లి వరకు రోడ్డుపక్కనే దాదాపు 12 వ్యవసాయ బావులు ఉన్నాయి. మామిడాలపల్లి, కొర్కల్, చల్లూరు, శ్రీరాములపేట, కిష్టంపేట, రెడ్డిపల్లి గ్రామాల్లో రోడ్డుపక్కనే కేవలం ముళ్లపొదల అడ్డుతోనే ఈ బావులు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపక్కన వ్యవసాయ బావులను గుర్తించి రక్షణ గోడలు నిర్మించాలని, హెచ్చరికబోర్డు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం గంగానగర్‌లో డిస్ట్రిక్ట్ గార్డ్స్, సివిల్ పోలీసులతో కలిసి ఇంటింటా తనిఖీ చేశారు. దొంగతనాలు, గంజాయి, సైబర్ క్రైమ్, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఇళ్లలో కిరాయికి వస్తే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. గతంలో ఎక్కడి నుంచి వచ్చారు, ఆధార్‌కార్డులు, ఉద్యోగం, కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్న తరువాతే కిరాయికి ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిపట్ల అప్రమత్తతో ఉండాలన్నారు. కొందరు సామగ్రి అమ్మకాల పేర పగటిపూట కాలనీల్లో తిరిగి తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతారన్నారు. ప్రతిఒక్కరూ ఇంటికి రెండు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలు, గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారానే వాటి బారిన పడకుండా ఉంటారన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్, రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, యువత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారనే విషయంపై వారి తల్లిదండ్రులు అప్రమత్తతో ఉండాలని సీఐ సూచించారు. ఈ తనిఖీలో ఎస్ఐలు భూమేష్, అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో చోరీకి యత్నం

కోల్‌సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. టౌన్‌షిప్‌లోకి చొరబడిన ఐదుగురు దొంగలు ముఖాలకు క్లాత్ కట్టుకుని చోరీకి యత్నించారు. బీ టైపు క్వార్టర్లు, అధికారుల నివాసాలలో చోరీకి యత్నించారు. మొత్తం ఐదు ఇళ్లలో చోరీకి ప్రయత్నాలు జరిగాయి. ఒక అధికారిని మెటర్నిటీలీవులో వెళ్లగా ఆ ఇంటితాళం పగులగొట్టి సామగ్రిని చిందర వందర చేశారు. కొన్ని క్వార్టర్లకు రెండువైపులా ద్వారాలు ఉండగా ఒకవైపు ద్వారాలకు తాళం వేసి మరొకవైపే వాడుకుంటారు. ఒక అధికారి ఇంట్లో ఎవరూ లేరనే భావంతో తాళం పగులగొట్టగా, లోపల ఉన్నవారు అలర్ట్ అయి, సెక్యూరిటీకి సమాచారం ఇచ్చారు. దీంతో దొంగలు పారిపోయారు. అదే సమయంలో పోలీస్‌పెట్రోలింగ్ వాహనం రావడంతో వారు కొద్దిసేపు దొంగల కోసం గాలించారు. పదిరోజుల క్రితం తాళంవేసి ఉన్న ఆరు క్వార్టర్లలో చోరీకి యత్నాలు జరిగాయి. మళ్లీ అదేతరహాలో చోరీకి యత్నించడంతో కుటుంబాలు ఆందోళన గురవుతున్నాయి. చోరీకి వచ్చిన దొంగలకు సంబంధించి కదలికలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వీరు స్థానికులు కాదని, ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా భావిస్తున్నారు.



సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగ కదలికలు

జోరుగా గుట్కా వ్యాపారం

- ప్రతీ నెల కోటి రూపాయల అక్రమ దందా
- పట్టించుకోని అధికారులు



వీణవంక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుట్కా, పొగాకు ఉత్పత్తులను నిషేంధించినా మండలంలో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. జమ్మికుంట, వీణవంకకు చెందిన కొంతమంది వ్యాపారులు గుట్కా మాఫియాగా ఏర్పడి విచ్చలవిడిగా నిషేధిత గుట్కావ్యాపారం చేస్తున్నారు. ప్రతి నెల దాదాపు కోటి రూపాయల నిషేధిత గుట్కాను కిరణా, పాన్‌షాపులలో విక్రయిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి హోల్‌సెల్‌గా తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు అడపాదడపా కేసులు పెడుతూ నామమాత్ర చర్యలు తీసుకుంటున్నారు. పలుమార్లు కేసులలో దొరికినా చట్టాలలోని లొసుగులతో తప్పించుకొని అడ్డూఅదుపులేకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు గుట్కా అమ్ముతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవా లని, రాష్ట్రంలోకి వచ్చే మూలాలపై నిఘా పెట్టి అమ్మకాలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయాలు..

నిషేధాన్ని ఆసరగా చేసుకొని ఐదు రూపాయల గుట్కాను పదిహేను రూపాయలకు విక్రయిస్తున్నారు. గుట్కా మాఫియా కొందరు అధికారులకు లక్షల్లో నెలవారీ మామూళ్లు ముట్టజెప్తూ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. వీరు రాజకీయ నాయకుల అండదండలతోనే వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రామాల్లో గుట్కాప్యాకెట్లను 20నుంచి40కి విక్రయిస్తుండగా దొరకడమే మహాభాగ్యం అన్నట్లు వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్‌క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి శివారులోని వాగునుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ తెలిపారు. ట్రాక్టర్ యజమానులు గొల్లపల్లికి చెందిన ఎలవేని అనిల్, బోనగిరి శ్రీధర్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొ న్నారు. గతంలో ఇసుక అక్రమరవాణాకు పాల్పడిన కేసులో చేగుర్తికి చెందిన కోటగిరి శ్రీనివాస్‌గౌడ్‌ను తహసీల్దార్ ఎదుట బైండో వర్ చేసినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇల్లంతకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి సమీపంలోని కెనాల్ దగ్గర నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం దాడిచేసి నాలుగుట్రాక్టర్లు, ఎక్స్‌కవే టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అదుపు తప్పి కారు బోల్తా

చందుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామశివా రులో శనివారం రాత్రి కారు అదుపు తప్పి బోల్తాపడింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి పనిపై వేములవాడ వెళ్లితిరిగి గ్రామానికి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న పెరికశ్రీనివాస్, చింతకుంట బాబయ్య స్వల్పగాయాలతో పడినట్లు తెలిపారు.

వృద్ధుడిని కరిచిన కుక్క

గంగాధర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ఒకరిని కుక్కకాటు వేసింది. గ్రామానికి చెందిన మరాఠి లింగయ్య(60) సైకిల్‌పై ఊర్లోకి వెళ్లాడు. ఈక్రమంలో ఓ కుక్క సైకిల్‌పై వెళుతున్న లింగయ్య కాలిపై రెండుచోట్ల దాడిచేసి గాయపర్చింది. కుటుంబసభ్యులు లింగయ్యను ఆస్పత్రికి తరలించారు.

అవగాహన ఏది?

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి తగ్గిన దరఖాస్తులు

కరీంనగర్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) నిరుపేద కుటుంబ పెద్ద మరణిస్తే ఆర్థిక సాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌బీఎస్ (జాతీయ కుటుంబ ప్రయోజన పథకం) అమలు చేస్తోంది. ఒకప్పుడు ఈ పథకం కింద వేలాది దరఖాస్తులు వచ్చేవి. అవగాహన లోపంతో ప్రస్తుతం దరఖాస్తులు పూర్తిగా తగ్గిపోయాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన యజమానులు ఏటా వందల సంఖ్యలో మరణిస్తున్నా దరఖాస్తులు రావడం లేదు. ఆయా శాఖల్లో సమన్వయ లోపంతో అర్హులకు అన్యాయం జరుగుతోంది. చాలా ఏళ్లుగా ఈ పథకం కొనసాగుతున్నా ప్రజలకు తెలియడం లేదు. అవగాహన లోపంతో చాలా మంది దరఖాస్తులు ఇవ్వడం లేదు.



- రూ.20వేల ఆర్థిక సాయం

దారిద్ర్య రేఖకు దిగువన ఉండే కుటుంబానికి చెందిన యజమాని మృతి చెందితే జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో 20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని కేంద్రం బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తుంది. కుటుంబ పెద్ద మరణించినప్పుడు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులం, ఆదాయం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మరణించిన వ్యక్తి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి. మృతి చెందినప్పటి నుంచి రెండేళ్ల వరకు ఎప్పుడైనా దరఖాస్తు అందజేసే అవకాశం ఉంది. దరఖాస్తు ఇచ్చిన తర్వాత ఆయా తహసీల్దార్ల స్థానికంగా విచారణ జరిపి ఆర్డీవో కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి కలెక్టర్‌కు, అనంతరం ప్రభుత్వానికి నివేదిస్తారు. ఈ పథకంపై అవగాహన లేకనే బాధిత కుటుంబాలు లబ్ధి పొందలేక పోతున్నాయి. ఈ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

చెరువుల్లో అక్రమ తవ్వకాలు

● అనుమతులు లేకుండా మట్టి తరలింపు

సైదాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో మట్టిని కొందరు అక్రమార్కులు మాయం చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్ యజమానులు, ట్రాక్టర్ యజమానులు చెరువుల్లో మట్టిని తవ్వి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లలో రోడ్లు వేయడానికి, ఇటుక బట్టీల వ్యాపారులు ఇటుకలు చేసేందుకు అక్రమంగా తరలిస్తున్నారు. సెలవుదినాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. కొన్నిగ్రామాల్లో స్థానికులు, మత్స్యకారులు చెరువుల్లో తవ్వకాలను అడ్డుకుంటున్నా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు. అడ్డుకున్నవారిని బెదిరిస్తున్నారు. ఈ దందా బహిరంగంగా జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలం లోని ఎలబోతారం చెరువు, వెన్నంపల్లి గై చెరువు, రోకరాయికుంట, సైదాపూర్ పెద్ద చెరువు, గొడిశాల కుంట, బొమ్మకల్ చెరువు, ఎక్లాస్‌పూర్ చెరువు, రాయికల్ కుంట, దుద్దెనపల్లి చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగు తున్నాయి. అధికారులు స్పందించి మట్టితవ్వకాలను అడ్డుకోవాలని మండల ప్రజలు, మత్స్యకారులు కోరుతున్నారు.



సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గై చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న ఎక్స్‌కవేటర్

భల్లూకంతో భయం..భయం..

● రేకుర్తిలో సంచారం
● సీసీ కెమెరాల్లో రికార్డు
● ఎస్‌యూ, నర్సింహస్వామి గుట్టల మధ్య రాకపోకలు



కరీంనగర్ రేకుర్తిలోని ఓ వీధి సీసీ కెమెరాలో రికార్డ్ అయిన ఎలుగుబంటి

కరీంనగర్ క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎలుగు బంటి సంచారంతో కరీంనగర్ శివారు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. మూడు రోజుల కిందట అర్ధరాత్రి సమయంలో రేకుర్తి కాలనీలో ఎలుగుబంటి సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డవగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఏటా వానాకాలం ఎలుగుబంట్లు కరీంనగర్ పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో కనిపించడం సాధారణంగా మారింది. స్థానిక శ్రీరాంనగర్, రేకుర్తి, లక్ష్మీపూర్, మల్కాపూర్, కిసాన్‌నగర్, బొమ్మకల్‌లో రాత్రి సమయంలో ఎలుగుబంటి సంచరించిన సందర్భాలు ఉన్నాయి. దశాబ్దాల కిందట కరీంనగర్ విద్యానగర్ ప్రాంతంలోని శాతవాహన విశ్వవిద్యాలయం, రేకుర్తిలోని లక్ష్మీ నర్సింహస్వామి గుట్టపైన ఎప్పుడూ ఎలుగుబంట్లు కనపడుతుండేవి. విశ్వవిద్యాలయా నికి 200 ఎకరాల స్థలం ఉంది. అధికభాగం గుట్టలు, గుహాలు, పెద్ద పెద్ద రాళ్లు, ముళ్లపొదలు, చెట్లతో నిండి అడవిని తలపించేది. నెమళ్లు, కోతులు, అడవి పందులు, కుందేళ్లు, కొండచిలువలు, కొండ గొర్రెలతో పాటు ఎలుగుబంట్లకు స్థావరంగా ఉండేది. విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణంతోపాటు విద్యార్థులు, పరిసర ప్రాంతాల ప్రజల కదలికలతో ఎలుగుబంట్ల జీవన విధానానికి ఆటంకం ఏర్పడింది. మరో వైపున రేకుర్తిలోని లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై ఆలయ పనులు ప్రారంభంతో అక్కడా వాటి ఆవాసాలు ధ్వంసమై తరచూ బయటకు వస్తున్నాయి. గతంలో ఎస్‌యూ క్యాంపస్‌లో ఎలుగు బంటి తారసపడడంతో వసతి గృహంలోని విద్యార్థులు కొన్ని రోజులు ఖాళీచేసి ఇంటికి వెళ్లిపోయారు. ఎస్‌యూలోని గుట్ట వద్ద అటవీ శాఖ అధికారులు పట్టుకునేందుకు ప్రయత్నిం చినా సాధ్యం కాలేదు. పెగ్‌మార్క్స్ ఆధారంగా ఎలుగుబంటి వచ్చిన విషయాన్ని నిర్ధారించు కున్నారు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు సంఘటనలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్న ఎలుగుబంట్లు తరచూ పంటపొలాల్లోకి, జనావాసాల్లోకి చొరబడి అలజడిని సృష్టించడం, అడ్డు వచ్చినవారిపై దాడులు చేయడంతోపాటు హతమార్చిన ఘటనలున్నాయి. మరో వైపున రైతులు, ప్రజల చేతిలో అవి కూడా హతమవుతున్నాయి. రెండేళ్ల కిందట మైలారం శివారులో ఒక ఎలుగుబంటిని జిలెటిన్‌స్టిక్స్‌తో గుర్తుతెలియని వ్యక్తులు చంపేశారు. కొద్ది కాలం కిందట మల్కాపూర్ శివారులో ఒక ఎలుగుబంటి తాగునీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వచ్చి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో మరణించింది.

● ప్రతిపాదనలకే పరిమితం

ఎలుగుబంట్ల సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు సైదాపూర్ మండలం ఆకునూర్, రాయికల్ పరిధిలోని 300 హెక్టార్ల విస్తీర్ణంలో ఎలుగుబంట్ల అభయారణ్యం ఏర్పాటుకు 2012లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు.

● గుట్టలు మాయం

సహజ వనరులకు, జీవన వైవిధ్యానికి పెట్టింది పేరుగా ప్రసిద్ధికెక్కిన ఉమ్మడి జిలాల్లో ప్రస్తుతం గుట్టలను కోల్పోయి వాటి స్థానంలో బొందల గడ్డలు ప్రత్యక్షమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రానైట్, కంకర క్వారీలతో పెద్ద గుట్టలు, వృక్షాలు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. దీంతో ఆవాసాలు కోల్పోయిన ఎలుగుబంట్లు, కోతులు, అడవిపందులు, ఇతర అటవీ జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయి.

● రక్షణ చర్యల్లో జాప్యం

జిల్లా అటవీశాఖ వద్ద రెస్క్యూటీం, ట్రాంకిలైజర్ గన్, ట్రాపర్ వెహికల్ వంటి రక్షణ పరికరాలు అందుబాటులో లేవు. కేవలం కొన్ని వలలు మాత్రమే ఉన్నాయి. వరంగల్ లేదా హైదరాబాద్ నుంచి రెస్క్యూటీం రావడానికి కనీసం 4 గంటల సమయం పడుతుంది. దీంతో అటవీ జంతువులను తక్షణమే బంధించడంలో జాప్యం జరుగుతోంది.

రెండు నెలల ముందు తేదీతో మరణ ధ్రువీకరణపత్రం

● జారీ చేసిన ఆస్పత్రి సిబ్బంది
● తండ్రి కడసారి చూపునకు కుమారుడికి ఇబ్బందులు

జగిత్యాల అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ప్రభుత్వ ప్రధానాసుపత్రి సిబ్బంది చేసిన తప్పిదం వల్ల విదేశాలలో ఉన్న కొడుకు తన తండ్రిని కడసారి చూసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బాధితుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన దుండిగాల నారాయణ అనారోగ్యంతో శుక్రవారం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. మెరుగైన చికిత్స అందించినప్పటికీ నారాయణ మృతిచెందారు. నారాయణ కుమారుడు రఘు ఖతార్‌లో ఉండగా తండ్రి మరణ వార్తను కుటుంబ సభ్యులు తెలియజేశారు. రఘు ఇంటికి రావడానికి తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం అవసరం ఉండగా కుటుంబ సభ్యులు జగిత్యాల ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన మరణ ధ్రువీకరణ పత్రాన్ని పంపించారు. అయితే నారాయణ శుక్రవారం మరణించగా ఆసుపత్రి సిబ్బంది జూలై 11న మరణించినట్లు కాకుండా 11-09-2025 రెండు నెలల ముందుగానే మరణించినట్లు మరణ ధ్రువీకరణ జారీచేశారు. రఘు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రంతో భారత్‌కు వెళ్లేందు కు ప్రయత్నించాడని ఖతార్‌లో రఘు పని చేస్తున్న కంపనీ అధికారులు అతన్ని భారత్‌కు పంపేందుకు నిరాకరించారు. ఆసుపత్రి సిబ్బంది మరో ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతో రఘు రావడానికి మార్గం సుగమమైనట్లు కుటుంబీకులు తెలిపారు.

సెస్ అధికారుల నిర్లక్ష్యం

● 24 మంది కూలీలకు త్రుటిలో తప్పిన ప్రమాదం

కోనరావుపేట జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామంలో సెస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 24 మంది వ్యవసాయ కూలీలకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. కోనరావుపేట మండలం కనగర్తిలో 24 మంది వ్యవసాయ కూలీలు వరినాట్లకు వెళ్లి ఇంటికి వస్తున్నారు. ఆటోలో వస్తుండగా ట్రాక్టర్‌కు ఉన్న పైపు వేలాడుతున్న విద్యుత్ మెయిన్‌లైన్లు తగలడంతో ఆటోలో ఉన్న 24మందికి విద్యుత్ షాక్ తగిలింది. ఆటోడ్రైవర్ ఆటోను వేగంగా ముందుకు తీసుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదిలా ఉండగా కనగర్తి, మల్కాపేట రహదారిలో విద్యుత్ తీగలు కిందికి ఉన్నాయని రెండేళ్లుగా ఏఈకి చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ అధికారులు విద్యుత్ తీగలను సరిచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సెస్ అధికారుల నిర్లక్ష్యం కూలీల ప్రాణాల మీదకి వచ్చిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ తీగలను సరిచేయాలని కోరు తున్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ రాజ్ ఏఈ

● సీసీ పనుల బిల్లుకు లంచం డిమాండ్ ● కాంట్రాక్టర్ నుంచి రూ.90 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శనివారం కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా పంచాయతీ ఏఈ జగదీష్‌ను ఏసీబీఅధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓదెల మండలం బాయమ్మపల్లెకు చెందిన కాంట్రాక్టర్ కావేటి రాజు మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో ఇటీవల రూ.15లక్షలతో నాలుగుచోట్ల సిమెంట్ రోడ్డుపనులు చేశారు. ఆ పనుల బిల్లుల కోసం ఏఈ జగదీష్ చుట్టుతిరగ్గా, ఎంతకు బిల్లులు చేయలేదు. బిల్లులు చేయాలంటే లక్ష రూపాయల కమీషన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆమేరకు అంత ఇచ్చుకోలేనని రూ.80వేలు ఇస్తానని రాజు పేర్కొన్నాడు. రూ.90 వేలు ఇస్తేనే బిల్లులు చేస్తానని చెప్పాడు. దీంతో కాంట్రాక్టర్ రాజు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏఈ జగదీష్‌కు రూ.90వేల నగదు ఇచ్చేందుకు అంగీకరించి శనివారం కాల్వశ్రీరాంపూర్ వెళ్లాడు. ఊరు బయట కారులో ఉన్న జగదీష్‌కు కాంట్రాక్టర్ రాజు రూ.90 వేల నగదును ఇవ్వగా, వెంటనే అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అక్కడి నుంచి ఆయనను జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ కార్యాలయానికి తరలించారు. పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీష్ అసలు పోస్టింగ్ ఎలిగేడు మండలం కాగా, అయనకు కాల్వశ్రీరాంపూర్ మండలతోపాటు ఓదెల మండలానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. సదరు ఇంజనీరింగ్ అధికారి బిల్లులు చెల్లించడంలో ప్రతిసారి కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం తీవ్రంగా వేధిస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా ఇచ్చే కమీషన్ల కంటే మోతాదుకు మించి కమీషన్లు ఇవ్వాలని వేధించడంతో ఒక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సదరు ఇంజనీరింగ్ అధికారి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. గతంలో జగదీష్ కరీంనగర్ మండలంలో ఏఈగాపనిచేసిన సమయంలో లంచం తీసుకుంటూ ఏసీబీఅధికారులకు పట్టుబడినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ కృష్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్ గంగా శివప్రసాద్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన ఏఈ జగదీష్



బాధితుడు కావేటి రాజు

ఏఈ ఇంటిలో ఏసీబీ సోదాలు

కరీంనగర్ క్రైం: లంచం తీసుకుంటూ ఏసీబీకిచిక్కిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ పంచాయతీరాజ్ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ పెండోట జగదీష్‌బాబుకు చెందిన కరీంనగర్ భాగ్యనగర్‌లోని ఇంటిలో శనివారం రాత్రి ఏసీబీ అధికా రులు సోదాలు నిర్వహించారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొన్ని రికార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకు న్నట్లు సమాచారం. ఏఈ జగదీష్‌బాబు 7సంవత్సరాల కిందట కూడా ఒకసారి ఏసీబీకి పట్టుబడినట్లు తెలి సింది. విచారణ అనంతరం ఏఈ జగదీష్ బాబును ఆదివారం కరీంనగర్ ప్రత్యేకఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి రజనీశ్రీ సాహిత్య పురస్కార ప్రదానం



పురస్కారం అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రజనీశ్రీ సాహిత్య పురస్కారాన్ని శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. జాతీయ సాహిత్యపరిషత్ కరీంనగర్ జిల్లాశాఖ ఏటా పురస్కారం అందజేస్తోంది. ఇందులో భాగంగా 2025సంవత్సరానికి శ్రీకాకుళంకు చెందిన మల్లారెడ్డి మురళీమోహన్ రచించిన 'నిశాచరుడి దివాస్వప్నం' కవితా సంపుటి పురస్కారానికి ఎంపికైంది. ఈసందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ విశ్రాంత ఆచార్యుడు కసిరెడ్డి వెంకటరెడ్డి, పురస్కారప్రదాత, మహాత్మాజ్యోతీబాపూలే రెసిడెన్షియల్‌పాఠశాలల సంయుక్తకార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్‌లాల్, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, దైవజ్ఞశర్మ, జాసాప రాష్ట్రఅధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయ రాజు, కఫిసా అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర చేతుల మీదుగా రచయిత పురస్కారం అందుకున్నారు. అనంతరం కేఎస్ అనంతా చార్య పుస్తక పరిచయం చేశారు. సంస్థ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రొఫెసర్ రఘు, అన్నవరం దేవేందర్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, నంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలి

● ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి
● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్

సిరిసిల్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయడంతోపాటు ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం టీపీటీఎఫ్ జిల్లాఅధ్యక్షుడు దుమాల రామ్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన 10వేల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఇవ్వాలన్నారు. గతప్రభుత్వం ప్రకటించిన పదివేల పోస్టులు ఇంతవరకు మంజూరు చేయలేదని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటిని మంజూరుచేసి ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా బీఎడ్ అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు కూడా ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులు ఇవ్వాలన్నారు. రేషనలైజేషన్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను మూసివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం 20మందివిద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా నిబంధనలను సవరించాలన్నారు. ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్రఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి విక్కుర్తిఅంజయ్య, ఉపాధ్యక్షులు మందాడిశ్రీనివాస్‌రెడ్డి, కెవి రజనిరాణి, కార్యదర్శి మైలారం తిరుపతి, చకినాల రమచంద్రం, ఎడ్ల కృష్ణ, చైతన్యరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ బుస్స రాజేందర్, శ్రీధర్, తాటికోండ సంజీవ్, జగిత్యాల శ్రీనివాస్, కదిరే శ్రీనివాస్, బోజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

తెలుగు వెలుగు మహానంది పురస్కార ప్రదానం



హైదరాబాద్‌లో మహానంది పురస్కారాన్ని అందుకున్న మల్లేశం, సంతోష్‌చారీ

గంభీరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం, మండల కేంద్రానికి చెందిన చేపూరి సంతోష్‌చారీ తెలుగు వెలుగు మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో త్యాగరాయ గానకళా నిలయంలో శనివారం తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందుకు న్నారు. యువరైతు బొంగు మల్లేశం సేంద్రియ వ్యవసాయరంగంలో కొన్ని సంవత్సరాలుగా ఆధునిక పద్ధతులతో అందరిదృష్టిని ఆకర్షించాడు. చేపూరి సంతోష్ చారీ వృత్తిపరంగా వడ్రంగి అయినా శిల్పాకళా రంగంలో రాణిస్తున్నాడు. తెలుగు వెలుగు జాతీయసంస్థ చైర్మన్ పోలోజు రాజకుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వలబోజ మోహన్‌రావు, ప్రపంచ గిన్నిస్‌బుక్ రికార్డు విజేత బ్రహ్మశ్రీ డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, కవి పండితుడు దైవజ్ఞశర్మ చేతులమీదుగా మల్లేశం, సంతోష్‌చారీ పురస్కారాన్ని అందుకున్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన మల్లన్న క్షేత్రం

పెద్దపట్నం, అగ్నిగుండ మహోత్సవాలకు ఏర్పాట్లు



విద్యుత్ కాంతుల వెలుగుల్లో ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం

ఓదెల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఈనెల13,15 తేదీల్లో పెద్దపట్నం, అగ్నిగుండ మహోత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో ఈ నెల 13న ఆదివారం రాత్రి పెద్దపట్నం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. అలాగే రాత్రి 7గంటలకు భద్రకాళి ఆవాహన, 10గంటలనుంచి అగ్నిగుండం మహోత్సవం, పెద్దపట్నం జరగనున్నదని తెలిపారు. 14నఉదయం 5 గంటలకు అగ్నిగుండం దాటుట అనంతరం దక్షయాగ కథా శ్రవణం, గెలుపు ఉత్సవం, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద, వితరణ జరపనున్నామని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఆలయం వరకు హుజూరాబాద్, కరీంనగర్ డిపోల నుంచి బస్సులు నడవనున్నాయి. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, సరిపడే విధంగా సౌకర్యాల ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకల ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి పోత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్‌ఐల ఆధ్వర్యంలో భద్రత బలగాలతో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

ఆలోచింపజేసిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటిక



నాటికలో ఓ సన్నివేశం

కరీంనగర్ కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీఎన్‌జీఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటిక ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా సైనిక్ సమతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల వెంకటేశ్ మాట్లాడుతూ బుద్ధుడి జీవితం అంబేద్కర్‌పై ఎలా ప్రభావం చూపిందో నాటికలో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజ చైతన్యం కోసం ఇలాంటి నాటికలు దోహదపడుతాయన్నారు. యువత, మేధావులు నాటిక స్ఫూర్తితో భావితరాలకు మార్గనిర్దేశనం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, సూర్య ప్రకాశ్, మారు సునీల్, బాలాజీ గైక్వాడ్, టీఎన్‌జీవో అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీపివాస రెడ్డి, లక్ష్మణరావు, రాజేశ్, శ్రవణ్, రోహిత్, నారాయణ, దేవేందర్, భిక్షపతి, రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతికి కారణమైన యువకుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ మారోజు స్వరూప మృతికి కారకుడైన వీర్నపల్లి మండలం మద్దిమల్లతండాకు చెందిన యువకుడు కెరావత్ నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన స్వరూప మద్దిమల్లతండాలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈనెల 7న సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. అంగన్‌వాడీ కేంద్రంలో స్వరూప వద్ద చిన్నతనంలో అక్షరాలు నేర్చుకున్న మద్దిమల్ల తండాకు చెందిన యువకుడు కెరావత్ నరేశ్ బైక్‌పై వెళుతున్న క్రమంలో తనను ఇంటి వద్ద దిగబెట్టమని అడిగింది. మద్యం మత్తులో ఉన్న నరేశ్ ఆమెను బండిపై ఎక్కించుకుని గ్రామం వైపు కాకుండా అటవీప్రాంతానికి తీసుకెళ్లాడు. బైక్‌పై ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడం వల్ల భయంతో కేకలు వేసింది. వాహనం వేగం పెంచి కిందకు నెట్టేశాడు. తలకు బలమైన గాయాలవడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. నాలుగు రోజులుగా మృత్యువుతో పోరాడిన స్వరూప ఈనెల 11న మరణించింది. ఈనెల8న నరేశ్‌పై వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదుచేశారు. కిడ్నాప్, లైంగికదాడి, మృతికి కారణమైన కేసులు నమోదు చేసి యువకుడు నరేశ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ వివరించారు.

ధర్మపురి నరసింహుని క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆషాఢ మాసం పురస్కరించుకుని ఉదయం వరకు క్షేత్రం అంతటా భక్తులతో రద్దీగా కనిపించింది. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తలు సేవలు అందించారు.



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దపల్లి బీజేపీలో వర్గ పోరు

(5వ పేజీ తరువాయి)

రీతిలో పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారని వారు ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వద్ద డబ్బులు తీసుకొని అమ్ముడు పోయారని, 130 గ్రామాలు ఉన్న నియోజకవర్గంలో కేవలం 20 గ్రామాలే పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వ హించారని పేర్కొన్నారు. పార్టీ నూతన అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డిని అడుగడుగునా అడ్డుకుంటున్నారని ప్రభారీలు మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అల్ఫోర్స్ నరేం దర్‌రెడ్డి వద్ద డబ్బులు తీసుకుని నియోజకవర్గంతో తనకు సంబంధం లేద న్నట్టు ముఖం చాటేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన స్వగ్రామం లోని బూత్‌లో ఆయనకు 15 ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలైనప్పటి నుంచి కనుమరుగైన ప్రదీప్ కుమార్ నియంతృత్వ పోకడలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రదీప్ కుమార్ అనుచరులది దండుపాళ్యం బ్యాచ్ అని విమర్శించారు.

కళాకారుడిని ఆదుకోరూ...!


ధూంధాం కార్యక్రమంలో మల్లారపు అనిల్ (ఫైల్)

జూలపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడుతాయని ప్రజలతోపాటు కళాకారులు కలలు కన్నారు. ఉద్యమ సమయంలో ధూంధాం కార్యక్రమాల ద్వారా ఆటాపాటలతో ప్రజలను చైతన్య పరిచారు. ప్రజలను ముందుకు నడిపించేందుకు తన వంతుగా ప్రత్యేక పాత్రను పోషించిన యువ కళాకారుడి గొంతు నేడు చిన్నబోయింది. కళాకారులను ప్రభుత్వం గుర్తించక పోవడంతో నిరాదరణకు గురవుతున్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను పోషించలేక అష్టకష్టాలు పడుతున్నారు.

కోనరావుపేట గ్రామానికి చెందిన మల్లారపు అనిల్ అనే యువ కళాకారుడు ప్రత్యేక రాష్ట్ర సాధన సమ యంలో తన ఆటాపాటలతో ప్రజలను ఉర్రూత లూగించాడు. తెలంగాణ ఉద్యమం లోనే కాకుండా గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసే కార్యక్రమాలను విజయవంతం చేసేం దుకు ప్రజల్ని చైతన్య పరిచాడు. 2015లో హరితహారంలో పాల్గొని మొక్కల ఆవశ్య కతను ప్రజలకు వివరించాడు. జూలపల్లి మండలంలోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తిరిగి ఆయా వేదికల ద్వారా మల్లారపు అనిల్ ఆటాపాటలతో ప్రజలను ఆకట్టుకున్నాడు. అప్పటి కలెక్టర్ దేవసేన, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు అనిల్‌ను అభినందిస్తూ మెమొంటో, ప్రశంసా పత్రంతో సన్మానిం చారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఉద్యమాన్ని, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషిచేసిన తనకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వేడుకుంటున్నాడు. ప్రభు త్వం సరైనా గుర్తింపు నిచ్చి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరుతున్నాడు.


కలెక్టర్ శ్రీదేవసేన చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న కళాకారుడు అనిల్ (ఫైల్)

స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి


ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వర్ణకారులు

పెద్దపల్లిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జ్యూవెలరీ దుకాణాల వల్ల ఉపాధి కోల్పోయి ఎందరో స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, స్వర్ణకారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఇవ్వాలని జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శనివారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో చేతి వృత్తులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించి తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు అన్యాయం జరుగుతుందన్నారు. జువెల్లరీ షోరూంలు విరివిగా ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణకార కుటుంబాలకు పనులు కరువై రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. బంగారం పనులు తక్కువ అవ్వడం మూలంగా ఆరు నెలల కాలంలో అనేక కుటుంబాలు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయని వాపో యారు. రాష్ట్రంలో స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, స్వర్ణకారులపై పోలీస్ వేధింపు లను అరికట్టాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు రాజు, ముఖ్య సలహాదారు కందుకూరి పెద్దన్న ప్రకాష్ రావు, కోశాధికారి కనపర్తి భాస్కర చారి, నాయకులు నరహరి, కట్ట నగేష్ కుమార్, కట్ట. శ్రీధరా చారి, బొజ్జం పురుషోత్తం, చంద్రశేఖర్, పాల్గొన్నారు. విశ్వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక పోస్టర్లు విడుదల చేశారు.

వైభవంగా గోరింటాకు వేడుక


గోరింటాకు వేడుకలో కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో పలుకాలనీల్లో ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో మార్కండేయకాలనీలో జరిగిన వేడుకకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జీ కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో ప్రతీ పండుగ ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుందని, గోరింటాకు పండుగ అనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయ ఆచారమని పేర్కొన్నారు. అనంతరం ఆటాపాటలతో సందడి చేశారు. వీణా, సత్య, వినోద, స్వాతి, శ్రీదేవి, పద్మ, రాధిక, ప్రభ, రాజ్యలక్ష్మి, సంధ్య, శ్రీలత, రమ్య, సౌజన్య పాల్గొన్నారు. దుర్గానగర్ లే అవుట్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుక నిర్వహించారు. మహిళలు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోరింటాకు వేడుక చేశారు. మహిళలు ఒకరికి ఒకరు అరచేతిలో గోరింటాకు పెట్టి సంబరాలు జరిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కాలనీ అధ్యక్షుడు తూముల రాజేశ్వర్ రావు, కమిటీ సభ్యులు జక్కుల నారాయణ, పీఎస్ అమరేందర్, పోకల ఆంజనేయులు, బాలసాని స్వామిగౌడ్, మహిళలు తూముల రమాదేవి, జక్కుల ఈశ్వరి, పీఎస్ రేఖ, బాలసాని పద్మ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రామగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఈ నెల 17న నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పూర్వజిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్ పిలుపు నిచ్చారు. శనివారం సెంటినరీకాలనీ ఏఐటీయుసి కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాలలో పార్టీ మహాసభలను నిర్వహించి నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని భవిష్యత్ పోరాట కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. పెద్దపల్లిలో జరిగే మహాసభకు సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. నాయకులు వై.వీరావు, జూపాక రాంచందర్, తిరుపతి, భూమయ్య పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ దిగుబడి చెక్కు అందుకున్న రైతు


కలెక్టర్ నుంచి చెక్కు అందుకుంటున్న రైతు

ఎలిగేడు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన రైతు జూనేని శ్యాం సుందర్ రావు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాడు. ఆయన 2022లో రెండు ఎకరాల్లో సాగు చేయగా రెండు టన్నుల పంట వచ్చిందన్నారు. దానిని తిరుమల ఆయిల్ కంపెనీకి విక్రయించగా ఒక టన్నుకు రూ.19 వేలు ధర లభించిందన్నారు. ఈ మేరకు రైతుకు విక్రయించగా వచ్చిన మొత్తాన్ని చెక్కు రూపంలో అధికారులకు అందించగా శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా కలెక్టర్ కార్యాలయంలో సదరు రైతుకు అందజేశారు.

గోల్డ్‌మెడల్ అందుకున్న విద్యార్థిని


గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న రోషిని

సుల్తానాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని తడిగొప్పుల రోషని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. రోషిని కాకినాడ జేఎన్‌టీయూలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ గోల్డ్‌మెడల్‌తో పాటు పట్టాను అందజేశారు. అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు రోషనికి యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ ప్రకటించగా మెడల్ ప్రదానం చేశారు.

మంత్రి శ్రీధర్‌బాబు పై అసత్య ఆరోపణలు మానుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంథని, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పోలీ సులపై దురుసుగా ప్రవర్తించిన బీఆర్ఎస్ నేత పూదరి సత్యనారా యణగౌడ్‌ను చట్ట ప్రకారం అదుపులోకి తీసుకొని మంథని కోర్టులో హాజరు పరిచారని కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లా డుతూ.. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాజకీయ ఉనికి కోసం చట్టపరం గా జరిగే అంశాల పై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు కాంగ్రెస్ పార్టీ బోర్డు పెడుతానని చెప్పడం సరైంది కాదన్నారు. మంథని సత్యం, బూడిద శంకర్, కొండ శంకర్, రాజయ్య, రాం రాజశేఖర్, మంథని శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం మాట్లాడుతూ ప్రేమజంట వ్యవహారానికి సంబంధించి పోలీసులు దర్యాప్తులో భాగంగా వెళ్ళగా బీఆర్ఎస్ నాయకులు దురుసుగా ప్రవర్తించడంతో సత్యనారాయణగౌడ్‌ను అరెస్టు చేశారన్నారు. ఆ వ్యవహారాన్ని మంత్రి శ్రీధర్‌బాబుపై రుద్దడం సిగ్గుచేటన్నారు. మరోమారు దుద్దిళ్ల కుటుంబంపై అర్థరహిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజీద్‌పాషా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, ముత్తారం మాజీ సర్పంచ్ తూటి రజితరఫీ, బక్కతట్ల వినీత్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబుపై బీఆర్ఎస్ నాయకుడు పుట్టమధుకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంథని బ్లాక్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తొట్లతిరుపతియాదవ్ ఎద్దేవా చేశారు. శనివారం ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంథని నియోజకవర్గ ప్రజల కోసం కాకుండా రాజకీయ ఉనికి కోసమే ఆరాట పడుతున్నాడని ఆరోపించారు. నియోజకవర్గానికి శ్రీధర్‌బాబు చేసిన అభివృద్ధిని ప్రశంసించడమే కాకుండా ప్రజలకు ఉపయోగపడే మార్గంలో వ్యవహరించాల్సిన బాధ్యత అతని పై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బదిలీ పై వెళ్తున్న అధికారికి సన్మానం



రామగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం కార్పొరేట్‌కు బదిలీ పై వెళ్తున్న రాజేంద్రప్రసాద్‌ను శనివారం ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అధికారులు యాదయ్య, బండి సత్యనారాయణ, సిహెచ్. వెంకటరమణ, రాజేంద్రకుమార్, సుధాకర్, శిరీషలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-3 జీఎం ఆదేశాల మేరకు రామగుండం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి కే పద్మ శనివారం ఓసీపీ-1లో వర్షాకాలంలో తీసుకోవలసిన ఆరోగ్య సంరక్షణ, జాగ్రత్తల గురించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో కలుషిత నీటి ద్వారా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి తెలియజేశారు. వర్షాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున కాచి, చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మేనేజర్ పాపయ్య, నాయకులు శేఖర్, శంకరయ్య, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి

సుల్తానాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి వెంట వచ్చిన సహాయకులకు శుచి రుచితో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని దేవి డైట్ బాధ్యులకు సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సందర్శించి అందులో రోగులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. రోజు వారి డైట్ ప్రోగ్రామ్‌ను తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న ఆహారం గురించి తెలుసుకున్నారు. రోగులకు సరిపడా భోజనం అందించాలన్నారు. డీఆర్‌డీఓ మాట్లాడుతు ఆసుపత్రిలో చేరిన గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆర్ఎంఓ డాక్టర్ మహేందర్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బయోమెట్రిక్

మంథనిరూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఏ) విధానాన్ని అమలు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎఫ్ఆర్ఏ అమలు కోసం పరికరాలను ఏర్పాటు చేసింది. ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈజీఎస్ సిబ్బంది రోజు విధులకు హాజరయ్యే సమయంలో 10.30 లోపు అటెండెన్స్ నమోదు చేసుకోవాలి. సిబ్బంది సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. జిల్లాలోని 13 మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధానం ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అటెండెన్స్ విధానానికి అవలంభిస్తున్నారు. విద్యా శాఖ పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో టీచర్ల కోసం ఏర్పాటు చేయగా విజయవంతం కావడంతో మండల పరిషత్ కార్యాలయాల్లో అమలు కోసం ఏర్పాటు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

పాలకుర్తి,జూలై 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం జయ్యారం గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా చెరువుకట్టపై ఖర్జూర మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గౌడ వృత్తిదారులు ప్రధానంగా ఈత,తాటి,ఖర్జూర మొక్కలను నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. గౌడసంఘం ప్రతినిధులు, ఎక్సైజ్ సిబ్బంది ప్రసాద్, రఘు, శ్రావణ్, రాజ్‌కుమార్, గీత పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

పాలకుర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఓ ప్రయివేటు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం తరగతులు నిర్వహించడంపై పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. విద్యార్థులను బయటకు పంపించినట్లు నాయకులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, గోరింగల సురేష్ తెలిపారు. నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అవయవ దానంపై అవగాహన

పాలకుర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కన్నాల, శాలపల్లి గ్రామంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు శనివారం నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన బూర్ల భాగ్యలక్ష్మి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. సంస్మరణ సభలో పాల్గొన్న సదాశయ ఫౌండేషన్ మండల అధ్యక్షుడు పృధ్వీరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శరీర దానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతినిధులు డాక్టర్ భీష్మాచారి, కన్నాల మాజీ సర్పంచ్ చంద్రకళ రామస్వామి, లక్ష్మీనర్సయ్య, బూర్ల శంకరయ్య, సతీష్, జ్ఞాపికను అందించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎం రాంచందర్‌రావును శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మహిళా మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. రామగుండంలో నెలకొన్న సమస్యలపై వివరించారు. నాయకులు కాసిపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, దాసరి శ్రీనివాస్, నవీన్ ఉన్నారు.

సమాచారం లేకుండానే భూమి కొలతలు

మంథని, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాగారం శివారులో ఉన్న భూములకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తహసీల్దార్ కుమారస్వామి కొలతలు ఎలా వేస్తారని ఉప్పట్ల, పోతారం గ్రామానికి చెందిన రైతులు కారెంగుల సురేష్, బడికెల సతీష్, బుద్దార్తి సత్తయ్య, భూపతి నరేష్‌లు ప్రశ్నించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ నాగారం శివారులో సర్వే నం. 147లో 12 ఎకరాల భూమి ఉంది. పోతారం గ్రామానికి చెందిన జాగిరి సదానందం యాదవ్ 3 ఎకరాల భూమి కొనుగోలుకు బయాన పెట్టాడు. అతనితో కలిసి తహసీల్దార్ భూమి వద్దకు వచ్చి తమకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సదానందం భూమికి వెంటనే కొలతలు వేశాడని, పేద రైతులను తహసీల్దార్ పట్టించుకోవడం లేదన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి

కోల్‌సిటీటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే దుష్పరిణామాలపై గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ కెడెట్లు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రాంమందిర్ ఏరియాలో ప్లకార్డులు పట్టుకొని ప్లాస్టిక్ సంచులతో కలిగే నష్టాలను వివరించారు. బట్ట సంచులను వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

'వెలుగుల వెనుక' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులు, రచయిత వేల్పుల నారాయణ రాసిన కథా సంపుటి వెలుగుల వెనుక పుస్తకావిష్కరణ, పరిచయ కార్యక్రమం శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజు, రచయిత వేల్పుల నారాయణ పుస్తకాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రచయిత వేల్పుల నారాయణ సింగరేణిలో కార్మికులు పడుతున్న కష్టాలను, వారి హక్కుల సాధన కోసం నిర్వహించిన ఉద్యమాలను కథా సంపుటి వెలుగుల వెనుక పుస్తకం ద్వారా వివరించారన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు తాళ్లపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తొడుపునూరి రమేష్, సుందర్‌రాజ్, రాజయ్య, రామకృష్ణ, పడాల కనకరాజు, బూడిద మల్లేష్ పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం

ఎలిగేడు, జూలై 12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. కనిపించిన వారిపై దాడి చేసి కరిచాయి. పశువులను తీవ్రంగా గాయపరిచాయి. ఒక్కసారిగా మీద పడడంతో ప్రజలు భయాందోళనలకు గురై పరుగులు పెట్టగా వారి వెంట పడ్డాయి. పలువురు గ్రామస్తులు కర్రలతో వాటిని గ్రామం నుంచి బయటకు తరిమేశారు. అధికారులు చొరవ తీసుకొని కుక్కల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్వామి

పాలకుర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బసంత్‌నగర్ ఎస్సై స్వామి అన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం ధర్మారం అడ్డరోడ్డు వద్ద ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

నేత్ర దానం

కళ్యాణ్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన బింగి లక్ష్మి(92) శనివారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు, ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. ఆమె కుటుంబ సభ్యులు రాజేశం, భారతిని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున్, రాజేందర్ అభినందించారు.

విద్యార్థుల ఇండస్ట్రీయల్ టూర్

మంథనిరూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు ఇండస్ట్రీయల్ టూర్‌కు తీసుకెళ్లారు. మంచిర్యాల జిల్లా జైపూర్ పవర్ ప్లాంట్‌కు విద్యార్థులకు పవర్ జనరేషన్, వాటర్ స్టిమింగ్, బొగ్గు ఏవిధంగా నీటి వేడి చేస్తుంది, వేడైన వాటర్ నుంచి వచ్చే స్టీమ్ ద్వారా మిషన్ రన్ అయినప్పుడు పవర్ ఏ విధంగా జనరేట్ అవుతుందనే అంశాలను విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు డాక్టర్ దొమ్మటి రవి, మంథని రాజశేఖర్, ముల్కల్ల రాజశేఖర్, మంజుల, అనిత, ధనుంజయ్, సంతోష్ పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స

కళ్యాణ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ వ్యక్తికి దంత వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. బెల్లంపల్లి మాదారం గ్రామానికి చెందిన ఇనుముల ఉప్పలయ్య శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ శనివారం గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి వచ్చాడు. అతడికి లడ్విగ్స్ అంజినా అనే ఇన్ఫెక్షన్ సోకడంతో దవడ కింద వాపు వచ్చి చీము తయారైంది. హెచ్‌వోడీలు డాక్టర్ శ్రావణ్, సుమలత ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించి చీమును తొలగించి వాయుమార్గ పేటేన్సీని సంరక్షించారు. గడ్డతో ఉప్పలయ్య శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందిగా ఉండడంతో అతనికి శస్త్ర చికిత్స నిర్వహించనట్టు డాక్టర్ సుమలత చెప్పారు. వైద్యులు లహరి, నయన శస్త్రచికిత్స లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ప్రిన్సిపాల్ హిమబిందు అభినందించారు.

టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమల్ల రాకేష్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం ఆయన అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు జరుపుకున్నారు. గాజుల అరుణ్, చరణ్, రవిచందర్, కిరణ్, నవీన్, శ్రీను,వేణు, ప్రశాంత్ పాల్గొన్నారు

కాల్వశ్రీరాంపూర్,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐటీ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మేడుదల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ రాకేష్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హన్మంతునిపేట గ్రామంలో మేకల కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మంత్రులకు సన్మానం

పెద్దపల్లి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వివేక్ వెంకట స్వామిలను రెయిన్‌బో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నీలారపు రజిత శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను సన్మానించారు. వివేక్, లక్ష్మణ్ కుమార్‌లకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నేతలకు నీలారపు రజిత కృతజ్ఞతలు తెలిపారు.